క్లుప్తంగా

ఈవీ పరిజ్ఞానంలో టీవీఎస్‌తో బుల్లయ్య కాలేజీ ఎంవోయూ



ఎంవోయూపై సంతకాలు చేస్తున్న టీవీఎస్ టీఎస్ ప్రతినిధులు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ వెహికల్ ల్యాబ్ ప్రారంభిస్తున్నారు. దీనికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు టీవీఎస్ ట్రైనింగ్ అండ్ సర్వీసెస్‌తో ఎంవోయూ చేసుకుంది. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు, టీవీఎస్ సంస్థ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా బుల్లయ్య కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వెహికిల్ విభాగానికి అవసరమైన సైద్ధాంతిక , సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ కేంద్రం అందిస్తుందన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో టీవీఎస్ టీఎస్‌కు చెందిన నిపుణులైన శిక్షకులు శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీవీఎస్ టీఎస్ సీఈవో జి.నారాయణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



సాయినగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

మద్దిలపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సాయినగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ బర్కత్ అలీ పలువురు నాయకులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సిబ్బందికి తగు సూచనలిచ్చారు.


రూ.68 లక్షలతో బీటీ రోడ్లు



అబిడ్‌నగర్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డులోని అబిడ్‌నగర్, ముస్లిం తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో బీటీ రోడ్లు నిర్మించనున్నారు. ఈ పనులకు శుక్రవారం జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం తాటిచెట్లపాలెం ఉర్దూ స్కూల్ నుంచి కేంద్రీయ విద్యాలయం వెనుక గేటు వరకు, అబిడ్‌నగర్ 1, 2, 3 మార్గాల్లో బీటీ రోడ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. దీని కోసం రూ.68 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. వార్డు పరిధిలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. స్థానికులు తమ ప్రాంతాల్లో మౌలిక సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని బాణాల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హబీబ్, ఖాన్, కాయల రామారావు, గోపి, శ్యామల, ఆర్పీలు, స్థానికులు పాల్గొన్నారు.

డ్యాన్సర్ షాహిద్‌కు సత్కారం



షాహిద్‌ను సత్కరిస్తున్న రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: ఓ టీవీ చానల్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన డ్యాన్స్ షో 'ఢీ' ప్రీమియర్ లీగ్‌లో 51వ వార్డు మాధవధార కళింగనరగ్‌కు చెందిన డ్యాన్సర్ షాహిద్ విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా శుక్రవారం అతడిని తన ఇంటి వద్ద కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ శాలువాతో సత్కరించి అభినందించారు.

సామాజిక భవనాలు.. చక్కని వేదికలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నియోజకవర్గంలోని మారుమూల ప్రదేశాల్లో కూడా అభివృద్ధి పరుగులు తీస్తోంది. ప్రజల అవసరాలను తెలుసుకుని, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తోంది. ఎట్టకేలకు ఎన్నో ఏళ్ల సమస్యలకు మోక్షం లభించడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- 50వ వార్డులో రూ.40 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- 51వ వార్డులో రూ.39 లక్షలతో సిద్ధమవుతున్న కళా వేదిక
- శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు తొలగిన ఇబ్బందులు
- సీఎం జగన్ పాలనపై స్థానికుల హర్షం





50వ వార్డు వంశీనగర్‌లో నిర్మించిన సామాజిక భవనం



51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో నిర్మాణం పూర్తయ్యే దశలో కళావేదిక

మద్రిపాలెం: జీవీఎంసీ 50, 51 వార్డుల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎంతో కాలంగా తీరని ప్రజల కలలు.. నేడు నెరవేరుతున్నాయి. 50వ వార్డు వంశీనగర్‌లో రజకులకు ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. వెంటనే రూ.40 లక్షల నిధులు మంజూరు చేసింది. శంకుస్థాపన నిర్వహించిన వెంటనే జీవీఎంసీ అధికారులు పనులు మొదలు పెట్టారు. చకచకా కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. సామాజిక భవనం రెండు ఫ్లోర్లలో ఉంది. కింద రజకులకు, పైన వంశీనగర్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి ఇవ్వడానికి కేటాయించారు. త్వరలోనే ఈ భవనం ప్రారంభం కానుంది. ఇది అందుబాటులోకి వస్తే అనేక శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా జరుపుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే 100 నుంచి 200 మంది వరకు సరిపోయేలా ఫంక్షన్లు చేసుకోవచ్చని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కల నెరవేరిన వేళ

తమ కోసం ఇలా ఓ భవంతిని కడతారని ఎన్నడూ తాము అనుకోలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక అనేక అభివృద్ధి పనులు చేస్తున్నారని వంశీనగర్ వాసులు కొనియాడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అటు రజకులు.. ఇటు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చాలా సార్లు కమ్యూనిటీ హాల్ కోసం వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఇప్పుడు కాలనీ వాసులు, రజకుల వ్యక్తిగత అవసరాలు, ఫంక్షన్ల కోసం ఇంత వేగంగా భవనం నిర్మించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

3 వేల కుటుంబాలకు ప్రయోజనకరం

జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ 1, 2, 3, రామన్ కాలనీలకు సంబంధించి కళావేదిక నిర్మాణం జోరుగా సాగుతోంది. రూ.39 లక్షలతో నిర్మాణ పనులను జీవీఎంసీ అధికారులు చేపట్టారు. త్వరలోనే ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ఈ వేదిక నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల్లో నివసించే సుమారు మూడు వేల మంది కుటుంబాలకు ప్రయోజకనకరంగా ఉంటుంది. ఇంట్లో ఏ కార్యం చేయాలన్నా.. ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుంది. సుమారుగా 550 చదరపు గజాలు ఉన్న ఈ ఓపెన్ ఆడిటోరియం(వేదిక)లో ఎన్నో శుభకార్యాలు చేసుకోవచ్చు. ఇంటి పరిసరాల్లోనే కళావేదిక తయారవుతుండడంతో స్థానికులు చాలా సంతోషంగా ఉన్నారు.

ఆనందంగా ఫంక్షన్లు చేసుకుంటాం



గత టీడీపీ హయాంలో స్థానికుల శుభకార్యాల కోసం కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయమని అడిగాం, పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వంశీనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ వారు, స్థానికులంతా కలిసి ఫంక్షన్లు చేసుకోడానికి వీలుగా ఓ భవనాన్ని ఏర్పాటు చేయాలని నాయకుల దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే స్పందించి ఏడాదిలోపే పూర్తి స్థాయిలో భవనాన్ని నిర్మించారు. చాలా ఆనందంగా ఉంది.

– ఎం.నారాయణరావు, వంశీనగర్, 50వ వార్డు

ప్రభుత్వం అన్నీ చేస్తోంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వంలో అన్ని పనులు చకచకా జరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని లబ్ధి చేకూరుస్తున్నారు. తమ ప్రాంతంలో కళావేదిక విషయమై గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదు. ఈ వేదిక నిర్మించడం వల్ల చాలా మంది ఫంక్షన్లు చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. డబ్బుల ఖర్చు కూడా తగ్గుతుంది.

– కె.అప్పారావు, అంబేడ్కర్ కాలనీ, 51వ వార్డు

సీఎం జగన్‌తోనే అభివృద్ధి



51వ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న రెయ్యి వెంకటరమణ తదితరులు

మద్రిపాలెం: అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. కళింగనగర్ 291 సచివాలయం పరిధి మాధవ స్వామి కల్యాణ మండపంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలో సంక్షేమ ఫలాల డిజిటల్ బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ అమలు పరిచిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సీవో ఉదయ్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, పైడి ప్రతాప్, బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, పొన్నాడ అప్పారావు మాస్టార్, శ్యామ్, గణేష్, రత్నం, లత, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలు



రామానుజన్ గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ శంకరరావు నాయుడు



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తాటిచెట్లపాలెం: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైల్వే న్యూకాలనీలోని హరగోపాల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ టి.శంకరరావు నాయుడు రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన జీవిత చరిత్రను వివరించారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. స్కూల్ విద్యార్థులు సుమారు 150 అంశాలతో కూడిన ప్రదర్శనలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. వాటిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు స్థానికులు తిలకించారు. ప్రతి తరగతిలో ఉత్తమ ఎగ్జిబిట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. తల్లిదండ్రుల కోసం లక్కీడిప్ నిర్వహించి ప్రథమ, ద్వితీయ విజేతలకు ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జిలు ఎర్నికుమారి, అన్నపూర్ణ, పాఠశాల పాల్గొన్నారు.

కంచరపాలెం: రామ్మూర్తిపంతులపేట జీవీఎంసీ హైస్కూల్‌లో రామానుజన్ చిత్రపటానికి హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఆదిశేషు, ఎ.వెంకటరమణ, చుక్కబాబు, శిరీష పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



స్వచ్ఛ ప్రమాణ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో కార్పొరేటర్ బర్కత్ అలీ

మద్రిపాలెం: ఎకో వైజాగ్ స్వచ్ఛ ప్రమాణ్‌లో భాగంగా శుక్రవారం పలు పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 51వ వార్డు పంజాబ్ హోటల్ దరి రాజీవ్‌నగర్‌లోని శాంతినికేతన్ స్కూల్‌లో 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అవగాహన కల్పించారు. పిల్లలతో శానిటేషన్‌పై లెటర్ రైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. వాటిపై పిల్లలు వారి తల్లిదండ్రులతో సంతకం పెట్టించి స్కూల్ యాజమాన్యానికి మూడు రోజుల్లో అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వాడకూడదన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగరాజు, సచివాలయ శానిటేషన్ సిబ్బంది రేష్మ, జోసెఫ్, హేమంత్, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

53వ వార్డులో..

జీవీఎంసీ 53వ వార్డులోని హెబ్రాన్ స్కూల్, బాలాజీ స్కూళ్లలో విద్యార్థులకు పరిశుభ్రతపై కార్పొరేటర్ బర్కత్ అలీ అవగాహన కల్పించారు. పిల్లలతో శానిటేషన్‌పై లెటర్ రైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. వాటిపై పిల్లలు వారి తల్లిదండ్రులతో సంతకం పెట్టించి స్కూల్ యాజమాన్యానికి మూడు రోజుల్లో అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా బర్కత్ అలీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి, జీవీఎంసీ సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలోఅటవీ శాఖ డైరెక్టర్ గుజ్జు వెంకటరెడ్డి, హనుమంతు, నబీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తులసి, సిబ్బంది పాల్గొన్నారు.

17,505 గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్ మీటర్లు

సీతంపేట(పార్వతీపురం): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 3,761 గిరిజన గ్రామాల్లో 17,505 గృహాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ డైరెక్టర్ (ప్రాజెక్టులు) ఏవీవీ సూర్యప్రతాప్ తెలిపారు. విద్యుత్ కనెక్షన్లపై పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో జరుగుతున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లోని ఏజెన్సీలో పీవీటీజీ గిరిజనులకు ఎన్ని కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు లేవనేదానిపై సర్వేచేస్తున్నామన్నారు. ఈ నెల 24 నాటికి సర్వే పూర్తవుతుందని చెప్పారు. ఆ తర్వాత ఉచిత విద్యుత్ మీటర్లు ఇచ్చి ప్రతీ ఇంటికి విద్యుత్ సదుపాయం కల్పిస్తామని స్పష్టంచేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 2,095 హేబిటేషన్లలో 13,600ల గృహాలకు విద్యుత్ సదుపాయం లేదని అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి నివేదికలు అందాయన్నారు. వీటన్నింటికీ యుద్ధప్రాతిపదికన ఉచిత కనెక్షన్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇకపై 24 గంటలూ విద్యుత్ సరఫరాకు వీలుగా త్రీఫేజ్ సప్‌లై త్వరలో ఇస్తామన్నారు. పట్టణాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ దశలవారీగా 18 నెలల్లో పూర్తిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎస్.కృష్ణ మూర్తి, ఏఈ నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

నేడే వైకుంఠనాథుడి దర్శనం

వైభవుడు, వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు



వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ ఉత్తర ద్వారం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



లలితా పీఠంలో పూల దండలతో అలంకరించిన వేంకటేశ్వర స్వామి ఆలయం



శ్రీనివాసనగర్‌లో పూలు, పండ్ల అలంకరణలో ఆలయ మండపం

మురళీనగర్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమీయనున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్తర ద్వార దర్శనాల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. వేలాది భక్తులకు దర్శనాలు వేగవంతంగా పూర్తయ్యేందుకు వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమవుతాయి. అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారు. స్వామి అలంకరణ అనంతరం దర్పణ దర్శనం ఉంటుంది. గోదర్శనం, కన్యాదర్శనంలో భాగంగా కన్యలు దీపాలు వెలిగించి స్వామికి చూపిస్తారు. గోదాదేశి తరఫున శ్రీరంగనాథుడికి పాశుర విన్నపం చదివి వినిపిస్తారు. ఉదయం 5.30 గంటలకు శ్రీదేవీ భూదేవి సమేత వైభవ వేంకటేశ్వర స్వామి తిరువీధి, అనంతరం ఉత్తర ద్వారం ద్వారా స్వామి ప్రవేశించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులవుతారు.

ప్రథమ దర్శనం..

ఉత్తర రాజగోపురం నిర్మాణ దాతలు లెప్పల రవిశంకర్ కుటుంబీకులు ప్రథమ దర్శనం చేసుకుంటారు. విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు స్వామిని దర్శించుకుంటారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు విరామం ఇచ్చి రాత్రి 10 గంటల వరకు దర్శనాలు ఉంటాయి. వైభవుడు సర్వాంగ వజ్రకవచంతో దర్శనమిస్తారు.

క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లు..

- ఉత్తర ద్వార దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు రానుండటంతో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.
- తూర్పు వైపు దాతలకు, రూ.500 టికెట్లు, రూ.100 టికెట్లు తీసుకున్న వారికి దర్శనాల క్యూలైన్లు ఏర్పాటు చేశారు.
- పశ్చిమ వైపు ఉచిత దర్శనాలతోపాటు రూ.500 టికెట్లు, రూ.100 టికెట్లు తీసుకున్న వారికి దర్శనాల క్యూలైన్లు ఏర్పాటు చేశారు.
- రద్దీని అదుపు చేసేందుకు 250 మంది వలంటీర్లు, ఆలయ సిబ్బంది పని చేస్తారు.
- భద్రతా చర్యల్లో భాగంగా లా అండర్ ఆర్డర్ విభాగం పోలీసులను షిఫ్ట్‌కు 75 మంది చొప్పున నియమించారు.
- ఆలయ ఉత్తర రహదారిని ఆనుకుని ఉన్న సింహాచలం దేవస్థానం ఖాళీ స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించారు.
- ప్రత్యేకంగా టాయిలెట్లు ఏర్పాటు చేశారు.
- భక్తులకు ఉచిత ప్రసాదాలు అందిస్తారు.

ఉదయం 5 నుంచి దర్శనాలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ప్రధాన అర్చకుడు రాజాస్వామి బృందం నేతృత్వంలో హోమం, అభిషేకాలు నిర్వహించారు. శనివారం ఉదయం 5 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నారు.

ముస్తాబైన ఆలయాలు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో వేంకటేశ్వరస్వామి, శ్రీనివాసనగర్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని పూల దండలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఉదయం 5.30 గంటల నుంచి లలితా పీఠంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్‌తెలిపారు.

- ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి దర్శనానికి అవకాశం కల్పిస్తున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: గృహ స్థాయిలో రోజువారీ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పూర్తిగా తగ్గించాలని 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ సూచించారు. ఎకో వైజాగ్ ప్రచారంలో భాగంగా శుక్రవారం శ్రీనివాసనగర్‌లోని సుపథ స్కూల్‌లో విద్యార్థులకు జీరో ప్లాస్టిక్ వేస్ట్‌పై అవగాహన కల్పించారు. పాలిథిన్ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విడనాడి, వాటికి ప్రత్యామ్నాయంగా స్టీల్, గాజు, పేపర్, నార వస్తువులను వినియోగించాలన్నారు. ఈ విషయాలపై తల్లిదండ్రులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సచివాలయ సిబ్బంది, స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు బాసటగా నిలుద్దాం



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: దివ్యాంగుల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అలీమ్ కో.. జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో శుక్రవారం పీ అండ్ టీ కాలనీలోని ఎస్‌ఎంసీహెచ్ స్కూల్ ఆవరణలో దివ్యాంగుల ఉపకరణాల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఉత్తర మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 30 లక్షల మంది దివ్యాంగులకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఉపకరణాలు అందించారని తెలిపారు. ఈ ఆర్థిక ఏడాదిలోపు 50 లక్షల మందికి అందించాలనే కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ప్రతి పౌరుడు దివ్యాంగులకు మనోధైర్యం కల్పించి బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, ప్రభుత్వ వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు జె.మాధవి, జీవీఎంసీ జోన్–3, కమిషనర్ విజయలక్ష్మి, అలీమ్ కో ప్రతినిధి శ్వేత, ఏపీడీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

సీతమ్మధార: గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని ద్వారకా జోన్ పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కేరళ మలాపురం, వెంగార గ్రామానికి చెందిన పి.ప్రణవ్ అనే యువకుడు ఒడిశా నుంచి గంజాయి తరలిస్తూ ఆశీలమెట్ట జంక్షన్‌లో అనుమానస్పదంగా కనిపించడంతో అదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర అతడిని విచారించారు. యువకుడి బ్యాగు తనిఖీ చేయగా 14 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ప్రణవ్ ఓ జ్యూస్ షాపులో పనిచేస్తున్నాడు.

ప్రజా సౌకర్యార్థమే రోడ్డు విస్తరణ పనులు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–5 పరిధి మాధవధార మెయిన్ రోడ్డు నుంచి అక్కయ్యపాలెం, నరసింహానగర్ రైతుబజార్ వరకు రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో మ్యారెట్ హోటల్ జంక్షన్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఉన్న 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. స్థానికులకు కొంత ఇబ్బంది కలిగించినప్పటికీ ప్రజల సౌకర్యార్థమై విస్తరణ పనులు చేపట్టామన్నారు. జోన్–5 టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఇవి జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానికులు అభ్యంతరం తెలిపినప్పటికీ వారందరికీ నచ్చచెప్పి విస్తరణ పనులు చేపట్టామన్నారు. ఈ రోడ్డు విస్తరణలో 22 భవనాలు ఉండగా.. వీటిలో ముగ్గురు కోర్టును ఆశ్రయించడంతో వారికి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ వారితో కూడా సంప్రదింపులు జరుపుతున్నామని, త్వరలో ఆ భవనాల తొలగింపునకు కూడా చర్యలు చేపడతామన్నారు. ఈస్ట్ పార్క్ నుంచి మాధవధార జంక్షన్ వరకు 60 అడుగుల రహదారి విస్తరణకు 32 భవనాలున్నాయని, ఈ రోడ్డులో ఒక భవనం మినహా అందరికీ నష్ట పరిహారం చెక్కులు ఇప్పటికే సిద్ధమయ్యాయని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.